ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్ భూపాలపల్లి

ములుగు

శుక్రవారం 4 అక్టోబరు 2024

పట్టణాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా..

అన్ని మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్-2050

- వచ్చే యేడాది మార్చి నాటికి రూపకల్పన
- సీఎం సూచనలతో మునిసిపల్ అధికారుల కసరత్తు
- ప్రతిపాదనల రూపకల్పనకు ప్రణాళికలు
- 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగం
- బ్లూ-గ్రీన్, గ్రీన్ మొబిలిటీ, గ్రీన్ ప్రాజెక్టులు సైతం అమలు
- ఇక వరంగల్ మాస్టర్ ప్లాన్ 2040కి కాలం చెల్లినట్టే!









హనుమకొండ, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి) : 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా..' నినాదంతో అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న వినూత్న కార్యక్రమం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు తొమ్మిది మున్సిపాలిటీలకు మహర్దశ పట్టనున్నది. జీడబ్ల్యుఎంసీతో పాటు మున్సిపాలిటీలకు వచ్చే యేడు మార్చికల్లా మాస్టర్ ప్లాన్-2050 తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మిగతా మున్సిపాలిటీలు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్, వర్ధన్నపేట, భూపాలపల్లి మున్సిపాలిటీలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తొలివిడతగా వరంగల్ కార్పొరేషన్‌తో పాటు మేజర్ మున్సిపాలిటీలైన జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల మున్సిపాలిటీలకు ఈ మాస్టర్ ప్లాన్ రూపకల్పనలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నది. రెండో విడతగా మిగతా మున్సిపాలిటీలపై దృష్టి సారించనున్నది.

సీఎం ఆదేశం మేరకు..

కొద్ది రోజుల కిందట ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా' గురించి వరంగల్‌లోనే సూత్రప్రాయంగా వెల్లడించారు. వరంగల్ నగరాభివృద్ధిపై ప్రజాప్రతినిధులు, వరంగల్ నగర పాలక సంస్థ, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థతో పాటు ఇతర మునిసిపల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంతో అర్బన్ అభివృద్ధి నమూనాపై దిశా నిర్దేశం చేశారు. ఇందులో భాగంగానే వరంగల్ మహానగర పాలక సంస్థ మాస్టర్-2050 ప్లాన్‌ను తెరమీదికి తీసుకువచ్చారు. ప్రస్తుతం సిద్ధంగా వరంగల్ మాస్టర్ ప్లాన్-2040 ఆమోదానికి సంబంధించిన అంశం చర్చకు వచ్చినప్పుడు సీఎం దీనిని యథాతథంగా ఆమోదించడానికి విముఖత వ్యక్తం చేశారు. పెరిగిన నగర జనాభా, అవసరాల దృష్ట్యా ఈ మాస్టర్‌ప్లాన్‌కు కాలం చెల్లిందన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్ హయాంలో అనుసరించిన అసంబద్ధ అర్బన్ అభివృద్ధి విధానాల వల్ల అంతా అస్తవ్యస్తంగా మారిందని, మాస్టర్‌ప్లాన్ ఆమోదించకుండా పదేళ్ల తొక్కిపెట్టడం వల్ల నగరం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చెందలేకపోయిందన్న అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో 'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త అర్బన్ ప్రణాళికను అమలు చేయబోతున్నట్టు సూచనాప్రాయంగా తెలియచేశారు. ప్రజల మౌలిక అవసరాలు, భవిష్యత్తులో నగర విస్తరణ, పెరిగే జనాభాను దృష్టిలో పెట్టుకొని వరంగల్ నగర మాస్టర్‌ప్లాన్-2040ని సవరించి వచ్చే 26 ఏళ్ల అవసరాలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్ -2050ను రూపొందించాలని ఆదేశించారు. అయితే ఇదే అభివృద్ధి నమూనాను ఒక్క వరంగల్ నగరానికే కాకుండా యావత్ తెలంగాణ పట్టణాలకు వర్తించేలా అన్ని మున్సిపాలిటీల్లో అమలుకు కూడా 2050 మాస్టర్‌ప్లాన్‌ను రూపొందించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. జీడబ్ల్యుజీఎంసీతో పాటు తొమ్మిది మున్సిపాలిటీల అధికారులు ఈ దిశగా కసరత్తు చేస్తున్నారు. మాస్టర్ ప్లాన్ -2050లో చెరువుల అభివృద్ధికి బ్లూ-గ్రీన్, కాలుష్య నివారణకు గ్రీన్ మొబిలిటీ, ఉద్గారాల నివారణకు, సౌరవిద్యుత్ వినియోగం ప్రోత్సహించే దిశగా గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు భాగంగా ఉంటాయి.

మునిసిపాలిటీలకు మహర్దశ

'అర్బన్ తెలంగాణ - అభివృద్ధి నమూనా'లో ఉమ్మడి జిల్లాలోని వరంగల్ నగర పాలకసంస్థతో పాటు ఈ తొమ్మిది మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రాధాన్యత లభించనున్నది. వచ్చే యేడు మార్చి కల్లా ఇందుకు సంబంధించి మాస్టర్ ప్లాన్-2050 తయారు కానున్నది. రానున్న 26 ఏళ్లలో అభివృద్ధి చెందనున్న పట్టణాలను దృష్టిలో పెట్టుకొని దీన్ని రూపొందించబోతున్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ (జీడబ్ల్యుఎంసీ)తో పాటు ఈ మునిసిపాలిటీలు ఇందులో భాగం కానున్నాయి. మునిసిపాలిటీల అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ పట్టణ సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగంగా చేయాలని ఇప్పటికే ఉన్నతాధికారులకు సూచించింది. మాస్టర్ ప్లాన్ -2050తో జిల్లాలోని మునిసిపాలిటీలకు భవిష్యత్తులో ఎన్నో ప్రయోజనాలు ఒనగూరుతాయని అధికారులు వివరిస్తున్నారు. బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం రాష్ట్రంలోని అన్ని మునిసిపాలిటీలకు కలిపి 2024-26 సంవత్సరాల్లో రూ.13,700కోట్లను వ్యయం చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో జిల్లాలోని పురపాలికలకూ నిధులు సమకూరుతాయి. దీంతో మౌలిక వసతులు మెరుగుపడతాయి. రాష్ట్రంలో 130 చెరువుల అభివృద్ధికి ప్రభుత్వం రూ.350కోట్లను వెచ్చించనున్నది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాలోని మునిసిపాలిటీల్లోని చెరువుల సంరక్షణకు సింహభాగం నిధులు అందనున్నాయి.

పలు ప్రాజెక్టులు

వరంగల్ కార్పొరేషన్‌తో పాటు జనగామ, మహబూబాబాద్ మునిసిపాలిటీలు చాలా పెద్దవి. పైగా వ్యాపారర, వాణిజ్య కేంద్రాలు. గ్రానైట్, లేటరైట్, ఇతరత్రా ముడిసరుకులు, వ్యవసాయ ఉత్పత్తులు పెద్ద ఎత్తున ఇక్కడి నుంచి రవాణా అవుతాయి. వీటిని దృష్టిలో పెట్టుకొని రవాణాపరంగా వాతావరణ కాలుష్యం జరగకుండా నివారించేందుకు బ్లూ-గ్రీన్ ప్రాజెక్టు అమలుకు చర్యలు తీసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు ప్రతిపాదనలను సిద్ధం చేయాల్సిందిగా మునిసిపాలిటీలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రతీ పట్టణానికి సమగ్ర రవాణా, ఆర్థిక ప్రణాళికలను మాస్టర్ ప్లాన్‌లో భాగం చేయాలని ప్రభుత్వం అధికారులకు సూచించింది. ఇందులో భాగంగా ప్రతీ పట్టణంలో బ్లూ-గ్రీన్ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చేపడుతోంది. బ్లూగ్రీన్ ప్రాజెక్టులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీల్లో ఉన్న గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణ, వాటి సుందరీకరణతో పాటు వరదల నియంత్రణ, వ్యర్థాల నిర్వహణ, పట్టణాల్లో హరితవనాల పెంపకం వంటివి చేపడతారు. ఇక గ్రీన్ మొబిలిటీ (హరిత రవాణా) ప్రాజెక్టుల్లో భాగంగా వరంగల్ నగరంతోపాటు జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, పరకాల, భూపాలపల్లి వంటి పెద్ద పట్టణాల్లో విద్యుత్ వాహనాలను పెద్ద ఎత్తున వినియోగించేలా ప్రోత్సహించి కాలుష్యాన్ని తగ్గిస్తారు. అవసరమున్న రద్దీ కూడళ్లలో పెద్దసంఖ్యలో ఫ్లైఓవర్ల నిర్మాణం వంటివి చేపడతారు. గ్రీన్ ఎనర్జీ పట్టణాల పేరుతో ప్రత్యేక ప్రాజెక్టులు కూడా చేపడతారు. నిర్మాణరంగంలో కర్బన్ ఉద్గారాలు వెలువడకుండా ఆధునాతన పర్యావరణ పరిరక్షణ పరిజ్ఞాన వినియోగం, సౌర విద్యుత్ వినియోగం వంటి గ్రీన్ ఎనర్జీ కార్యక్రమాలు చేపడతారు.

అధికారులు ప్రజల మన్ననలు పొందాలి

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



మంగపేటలో బస్టాండ్ నిర్మాణ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

మంగపేట, అక్టోబరు 3: మండలంలో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అధికారులే ప్రజాప్రతినిధులుగా వ్యవహరించి ప్రజల మన్ననలు పొందాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం మంగపేటలో పర్యటించిన మంత్రి సీతక్క స్థానిక ఎంపీడీవో కార్యాలయం పక్కనున్న 30 గుంటల స్థలంలో రూ.52 లక్షలతో ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణం కోసం భూమిపూజ చేసి మాట్లాడారు. మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న బస్టాండ్ నిర్మాణం కలను తమ ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. అధికారులందరు ప్రజా సంక్షేమం కోసం పాటుపడి వారి బాగోగులను చూసుకుంటే అభినందిస్తామని, పనులు సక్రమంగా చేయకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి దేవస్థానం అభివృద్ధి కోసం రూ.1.70 లక్షలు దేవాదాయ శాఖ నుంచి ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. బస్టాండ్ నిర్మాణం అతి తక్కువ కాలంలో పూర్తిచేసి రాకపోకలకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలని సీతక్క అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం డి.విజయభాను, డిప్యూటీ ఆర్ఎంవో కె.భానుకిరణ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె.భాస్కర్, డీఎం వి.జ్యోత్స్న, అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, మెకానికల్ ఇంజనీర్ ఇ.అమల, ఆర్టీసీ ఉద్యోగులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పోషకాహారం అమృతం లాంటిది

పోషకాహారం మనిషికి అమృతం లాంటిదని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల్లో పోషణ లోపాన్ని అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని గంపోనిగూడెం శివారులో గల రైతు వేదిక ఆవరణలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ములుగు ఆధ్వర్యంలో పోషణ్ మాస సంబరాల జిల్లా స్థాయి ముగింపు వేడుకలు జరుగగా మంత్రి సీతక్క హాజరయ్యారు. వంటకాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేసి మాట్లా డారు. సమాజం ఎలా నాగరికంగా అభివృద్ధి చెందుతుందో అంతగా కలుషితమవుతుందని అన్నారు. సృష్టిలో కలుషితం కానిది తల్లిపాలు మాత్రమేనన్నారు. ములుగు జిల్లా అత్యధికంగా మారుమూల గిరిజన గూడాలను కలిగి ఉందన్నారు. ఈ ప్రాంతాల్లో అనేక రకాల వ్యాధులు పిల్లలకు సోకుతున్నాయని, వాటి నివారణ కోసం పిల్లలకు, తల్లులకు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందించాలని అంగన్‌వాడీలకు సూచించారు. అనంతరం 13మంది గర్భిణులకు మంత్రి సీతక్క చేతుల మీదుగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. అనంతరం మంత్రి, కలెక్టర్ బతుకమ్మ ఆడారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (ఇన్‌చార్జ్) సంపత్‌రావు, మండల ప్రత్యేకాధికారి తుల రవి, డీడబ్ల్యూవో ఉషారాణి, ఐసీడీఎస్ సీడీపీవోలు ప్రేమలత, మల్లేశ్వరి, ముత్తమ్మ, ఏటూరునాగారం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్లు, పోషణ్ అభియాన్ సిబ్బంది ఇమ్మానుయెల్, శ్రావణి, వీరేంద్ర, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు. అనంతరం ఐకేపీ, వెలుగు మహిళలతో బతుకమ్మ ఆటపాటలలో మంత్రి సీతక్క, కలెక్టర్ పాల్గొన్నారు. మంత్రి పర్యటన రాత్రి వరకు సాగగా, ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, స్థానిక ఎస్సై టీవీఆర్ సూరి, ప్రొబేషనరీ ఎస్సైలు బందోబస్తు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ఇన్‌చార్జ్ తహసీల్దార్ మల్లేశ్వర్‌రావు, ఎంపీడీవో భద్రు, ఎంపీవో శ్రీకాంత్, కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

దండకారణ్యంలో ఏం జరుగుతోంది?

- కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టుల సమావేశం!
- చర్చనీయాంశంగా మారిన మావోయిస్టుల రాక
- వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వివరాలు 7లో..



ధాన్యం సేకరణ ప్రతిష్టాత్మకంగా చేపట్టాలి

తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దు

సన్న, దొడ్డు రకాలను వేరువేరుగా నిల్వ చేయాలి

వీసీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



వీసీలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3: ధాన్యం సేకరణను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి సీఎం వానాకాలం ధాన్యం కొనుగోళ్లు, డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 60.73 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతుందని, 1.47 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యం కొనుగోళ్లకు 7వేలకు పైగా కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను ఉమ్మడి జిల్లాల నోడల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలన్నారు. ఈ ఏడాది నుంచి ప్రభుత్వం సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తున్నందున సన్న, దొడ్డు రకాలకు వేరువేరుగా కౌంటర్లు ఏర్పాటు చేయడంతో పాటు వేరువేరుగా నిల్వ చేయాలన్నారు. ప్రతి కొనుగోలుకు క్రమసంఖ్య కేటాయించాలన్నారు. ఇలా చేయడం వలన అవకతవకలు జరిగితే సులువుగా గుర్తించే అవకాశం ఉంటుందని అన్నారు. రైతులను తాలు, తరుగు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేకుండా అవసరమయ్యే గన్నీలను ముందుగానే సమకూర్చుకోవాలన్నారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. టార్పాలిన్లు, మాయిచ్చర్, ఎలక్ట్రానిక్ యంత్రాలను అందుబాటులో ఉంచాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యంను ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు. కొనుగోలు కేంద్రాల సమస్యల పరిష్కారంకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు కాల్ సెంటర్స్ ఏర్పాటు చేయాలన్నారు. అక్టోబరు 9వ తేదీన డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలు జారీ చేస్తామని తెలిపారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియ ఈనెల 5 వరకు మాత్రమే ఉన్నందున వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారించాలి

కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, అక్టోబరు 3: ఎల్‌ఆర్‌ఎస్ 2020లో ఇంటి స్థలాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో విచారణ చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. భూపాలపల్లి కలెక్టరేట్‌లో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణ ప్రక్రియ నిర్వహణకు నియమించిన రెవెన్యూ, మునిసిపల్, గ్రామ పంచాయతీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8,310 దరఖాస్తులు ఎల్‌ఆర్‌ఎస్ కోసం వస్తే ఇప్పటి వరకు 982 దరఖాస్తుల విచారణ పూర్తి అయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న 7,328 దరఖాస్తుల విచారణ ప్రక్రియ చేపట్టాలన్నారు. దరఖాస్తుదారుల్లో ఎవరైనా డాక్యుమెంట్లను పోర్టల్‌లో అప్‌లోడ్ చేయకపోతే మళ్లీ అవకాశం కల్పించాలన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తుల విచారణకు 56 టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విచారణ ప్రక్రియ నిష్పక్షపాతంగా పూర్తి చేసేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీపీవో నారాయణరావు, మునిసిపల్ కమిషనర్ రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరుకావాలి..

డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ విచారణ ప్రక్రియకు ఈనెల 5వ తేది వరకు మాత్రమే అవకాశం ఉన్నందున హాజరుకావాలని కలెక్టర్ రాహుల్‌శర్మ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించిన కలెక్టర్ డీఎస్సీకి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ విచారణ, వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డీఎస్సీకి జిల్లాలో 589 మంది ఎంపికయ్యారని, వారిలో 1:3 నిష్పత్తిలో సరిఫికెట్స్ విచారణ జరుగుతుంటే ఇప్పటి వరకు 197 మంది మాత్రమే హాజరయ్యారన్నారు. వెరిఫికేషన్ ప్రక్రియకు ఈనెల 5 వరకు మాత్రమే గడువు ఉన్నందున ప్రక్రియ వేగవంతం చేయాలని డీఈవోను ఆదేశించారు. ధాన్యం కొనుగోలులో సన్న, దొడ్డు రకాలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఏడాది ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడం వలన 2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ జరిగే అవకాశం ఉందన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రంలో ప్యాడీక్లీనర్లు, తూకపు యంత్రాలు, మాయిచ్చర్స్, టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్‌సింగ్, అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈవో రాజేందర్, డీఎస్‌వో శ్రీనాథ్, డీఎం రాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీజ్ ఉత్సవాలు

తండాల్లో ఆటపాటలతో అలరించిన బంజారాలు

హాజరైన ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



తీజ్ ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3: లంబాడీల సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే తీజ్ ఉత్సవాలు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఘనంగా జరిగాయి. తండాల్లో ఉన్న పెళ్లికాని యువతులు తమ ఆరాధ్య దైవమైన సీత్లా మేరమా మాత శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్‌లను తలుచుకుని భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకున్నారు. కఠిన నియమాలను పాటిస్తూ దుస్సేరు తీగలతో అల్లిన బుట్టలో పుట్టమట్టిని పోసి గోధుమలు వేసి తొమ్మిది రోజుల పాటు బావి నీటిని పోసి పూజించి గురువారం నిమజ్జనం చేశారు. డీజే పాటలకు స్టెప్పులు వేస్తూ పాటలు పాడుతూ సందడి చేశారు. ఈ పండుగను పట్టణంలోని బానోతువాడ, హనుమాన్‌నగర్, వేశాలపల్లి తండా, ఇతర మండలాల్లోని తండాలలో ఘనంగా నిర్వహించారు. భూపాలపల్లిలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తీజ్ ఉత్సవాలలో పాల్గొని బంజారా యువతులు, మహిళలతో కలిసి నృత్యం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తండాలలో ఎంతో నిష్ఠతో యువతులు చేస్తున్న దీక్ష ఫలించాలని, పిల్లాపాపలతో ప్రజలంతా సుఖసంతోషాలతో జీవించాలని వారి ఆరాధ్య దైవాన్ని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఇస్లావత్ దేవన్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు భట్టు కర్ణాకర్, లంబాడీల పెద్దలు గుజురోతు రాజూనాయక్, విస్లావత్ రాజూనాయక్, బాలూనాయక్, సేవానాయక్, రాజేష్, కౌన్సిలర్లు శిరుప అనిల్, ముంజాల రవీందర్, నాయకులు నారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ప్రతిభ గుర్తించడానికి డ్యూటీ మీట్

తెలంగాణ ఏర్పడిన తరువాత కాళేశ్వరం జోన్‌లో మొదటిసారి నిర్వహణ

రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 3: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొట్టమొదటి సారిగా డ్యూటీ మీట్ జరుగుతుందని, దానిలో భాగంగా కాళేశ్వరం జోన్‌లో జోన్ స్థాయి డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్టు రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం కాళేశ్వరం జోన్ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి, కొమురంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల పరిధిలోని అధికారులు, సిబ్బందికి జోన్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్యూటీ మీట్‌ల వల్ల నైపుణ్యం, సామర్థ్యం మెరుగుపడుతాయని, అధికారులు, సిబ్బందిలో ప్రతిభ వెలుగులోకి వస్తుందన్నారు. ఇప్పటికే కమిషనరేట్ స్థాయిలో డ్యూటీ మీట్ నిర్వహించామని, ఇప్పుడు జోన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జోన్ స్థాయిలో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెల 14నుంచి 18వరకు జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని, అందులో జోన్ ప్రతిభను చాటాలన్నారు. సైటింఫిక్ ఎయిడ్స్ టు ఇన్వెస్టిగేషన్ ఈవెంట్, యాంటీ సబొటేజ్‌చెక్, కంప్యూటర్ అవేర్నెస్ కాంపిటీషన్ ఈవెంట్, డాగ్ స్క్వాడ్ కాంపిటీషన్‌లలో ఈవెంట్స్ ఉంటాయన్నారు. సైంటిఫిక్ ఇన్వెస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ ఇన్వెస్టిగేషన్ కోసం సాంకేతిక పరిజ్ఞానం, కేసుల మెళకువలు నేర్చుకునేందుకు డ్యూటీ మీట్ ఉపయోగపడుతుందన్నారు. సంక్లిష్టమైన కేసులను పరిష్కరించడానికి పరస్పర ఆలోచనల మార్పిడి సాధ్యమవుతందని, ఒకరి నుంచి ఒకరు అనుభవాలను కూడా తెలుసుకుంటారన్నారు. వృత్తిపరమైన సామర్థ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. ఈ డ్యూటీ మీట్‌లో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే డ్యూటీ మీట్‌లకు పంపుతారన్నారు. కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సి.రాజు, గోదావరిఖని ఏసీపీ రమేష్, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ములుగు ఏసీపీ రాములు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, సంపత్, మల్లేశం, శ్రీనివాస్, కమిషనరేట్ పరిధిలోని పలు జిల్లాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పాముకాటుతో మూడేళ్ల బాలుడి మృతి

పండగ పూట శంకరాజుపల్లిలో విషాదం





వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందిన బాలుడు, గగన్ (ఫైల్)

ఏటూరునాగారం, అక్టోబరు 3: పాముకాటుతో మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ విషాద సంఘటన ఏటూరునాగారం మండలంలో గురువారం చోటుచేసుకుంది. కుటుంబీకులు తెలిపిన ప్రకారం... ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లి గ్రామానికి చెందిన నిరుపేద అయిన మంతెన సుమన్-మానస దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వీరికి ముగ్గురు కుమారులు ఉన్నారు. గ్రామంలో ఎలాంటి పనులు దొరకక్క పోవడంతో నెల రోజుల క్రితం చిన్న బోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని హనుమాన్‌నగర్‌కు వెళ్లి కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు.

ఈ క్రమంలో మంగళవారం వారు కూలీ పనులకు వెళ్లగా చిన్నకుమారుడు మంతెన గగన్(3) ఇంటి ముందు ఆడుకుంటుండగా పాము కాటు వేసింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గగన్‌ను పాము కాటు వేసిన విషయాన్ని గమనించలేదు. తల్లిదండ్రులు సాయంత్రం ఇంటికి చేరుకోగా అప్పటికే బాలుడు నురుగులు కక్కుతూ అస్వస్థతకు లోనయ్యాడు. కుటుంబీకులు మండల కేంద్రంలోని సామాజిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు బాలున్ని పాము కాటు వేసిందని గుర్తించి పరిస్థితి విషమించడంతో అదేరోజు రాత్రి అంబులెన్స్‌లో ములుగులోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు సైతం గగన్ పరిస్థితి పూర్తిగా విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మధ్యాహ్నం మృతి చెందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వారు కావడంతో మృతదేహాన్ని గ్రామానికి తరలించే స్థోమత లేకపోవడంతో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనరసింహారావు సూచనల మేరకు ఆ పార్టీ జిల్లా నాయకుడు కాకులమర్రి ప్రదీప్‌బాబు చొరవ తీసుకొని అంబులెన్స్‌లో శంకరాజుపల్లికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలో పండగ పూట విషాదం నెలకొంది.

ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పోస్టుపై అనిశ్చితి

వరంగల్ మెడికల్, అక్టోబరు 3: హనుమకొండ ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ ఉన్నట్లా? లేనట్టా? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గతంలో ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేసిన విజయలక్ష్మీ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణకు దరఖాస్తు చేసుకోగా, డీఎంఈ సానుకూలంగా స్పందించలేదని తెలిసింది. కాగా, ఇటీవలే ఇక్కడికి ప్రొఫెసర్‌గా బదిలీపై వచ్చిన డాక్టర్ రాజేశ్వరిని ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా కొనసాగాలని డీఎంఈ ఆదేశించారు. అయితే సూపరింటెండెంట్ బాధ్యతలు తీసుకోలేనని డీఎంఈకి మొరపెట్టుకున్నట్లు తెలిసింది. డాక్టర్ విజయలక్ష్మి సెలవుపై వెళ్లడం, కొత్తగా డాక్టర్ రాజేశ్వరికి సూపరింటెండెంట్‌గా బాధ్యతలను తీసుకోవడానికి సిద్ధంగా లేకపోవడంతో జీఎంహెచ్ పాలన అస్తవ్యస్తంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.





నేడే కేయూ కొత్త వీసీ ఎంపిక

- సెక్రటేరియెట్‌లో సెర్చ్ కమిటీ కీలక సమావేశం
- వీసీ పదవిపై గంపెడాశలతో ఆశావహులు
- హైదరాబాద్‌లోనే తిష్ట వేసి గాడ్ ఫాదర్ల చుట్టూ ప్రదక్షిణలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కాకతీయ యూనివర్సిటీకి కొత్త వైస్ చాన్స్‌లర్ ఎంపిక ప్రక్రియ తుది ఘట్టానికి చేరింది. ఈనెల 4న శుక్రవారం హైదరాబాద్‌లోని సెక్రటేరియట్‌లో సెర్చ్ కమిటీ సమావేశం కానుంది. గతంలో వెలువరించిన నోటిఫికేషన్ మేరకు కేయూ వీసీ పదవి కోసం వర్సిటీలో పనిచేస్తూ 10 ఏళ్ల సర్వీసు పూర్తయిన ప్రొఫెసర్లు, రిటైర్డు ప్రొఫెసర్లతో పాటు ఇతర వర్సిటీలకు చెందిన ప్రొఫెసర్లు దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో సరైన అర్హతలు, సామాజిక సమీకరణాలు, రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతల మేరకు అనుభవజ్ఞులైన ముగ్గురిని వీసీ పదవికి సెర్చ్ కమిటీ తుది ఎంపిక చేస్తోంది. కేయూ వీసీ పదవికి సెర్చ్ కమిటీ సభ్యులు వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని అర్హతల మేరకు ఎంపిక చేస్తారు. తుది ఎంపికలో ఖరారైన ముగ్గురి పేర్లను సీల్డ్ కవర్‌లో రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారు. గవర్నర్ సీఎం ఆమోదంతో సీల్డ్ కవర్‌లోని ముగ్గురిలో ఒక్కరిని వీసీగా ప్రకటిస్తారు. అన్ని అనుకున్నట్లు జరిగితే వారం, పది రోజుల్లో వర్సిటీకి కొత్త వీసీ బాధ్యతలు చేపట్టనున్నారు.

గంపెడాశతో ప్రొఫెసర్లు

కేయూ వీసీ పోస్టుపై గంపెడాశతో ఎందరో అర్హులైన ప్రొఫెసర్లు ఎదురు చూస్తున్నారు. తమకు తెలిసిన మంత్రులు, ఎమ్మెల్యేలతో పాటు తమ సామాజిక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులతో ఇప్పటికే పైరవీలకు దిగారు. గతంలో వర్సిటీలో నిర్వహించిన పదవులు, ఇతర అనుభవాలతో పాటు, సామాజిక, రాజకీయ అర్హతలను విన్నవిస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. తమకు దగ్గరైన గాడ్‌ఫాదర్ల చుట్టూ తిరుగుతూ ముమ్మరంగా పైరవీలు చేసుకుంటున్నారు. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైర్డు ప్రొఫెసర్లు ఈ దఫా వీసీ పదవికి తీవ్రంగా పోటీ పడుతున్నారు.

ఎస్సీ లేదా ఓసీలకు అవకాశం

కేయూకు ఈ దఫా వచ్చే వీసీ ఎస్సీ లేదా ఓసీ వర్గాలకు చెందిన వారే వస్తారని అంచనా వేస్తున్నారు. గతంలో బీసీ వర్గానికి చెందిన ప్రొఫెసర్ తాటికొండ రమేశ్‌కు బీఆర్ఎస్ ప్రభుత్వం వీసీగా అవకాశం కల్పించింది. అంతకుముందు రెండు దఫాలుగా ఎస్సీ సామాజికవర్గాలకు చెందిన ప్రొఫెసర్ బి.వెంకటరత్నం, ప్రొఫెసర్ ఆర్.సాయన్నలకు అవకాశం కల్పించింది. ఈ దఫా మళ్లీ ఎస్సీకి అవకాశం ఇస్తారా..? ఓసీ వర్గాలకు ఇస్తారా ? అనే అంశంలో సందిగ్ధత నడుస్తోంది. ఓసీ వర్గాల నుంచి ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి వైఎస్ఆర్ హయాంలో వీసీగా సేవలందించారు. అయితే రాష్ట్రంలోని 10 వర్సిటీల్లో సామాజిక సమీకరణాలు కలిసి రాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో కేయూ వీసీ పదవి బీసీలకు వచ్చే అవకాశం వుంది.

సమర్థులకు అవకాశం వచ్చేనా ?

కేయూ వీసీ ఈ దఫానైనా సమర్థవంతులైన వారికి తగ్గుతుందా ? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. గత వీసీ పాలనలో వర్సిటీ అభాసుపాలైంది. అదే క్రమంలో వర్సిటీ చరిత్రలో ఎప్పుడూ లేనంతగా మాజీ వీసీ తాటికొండ రమేశ్ అపఖ్యాతి పాలయ్యారు. విజిలెన్స్ విచారణలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో కేయూ సమర్థవంతులైన వారే వీసీగా రావాలని వర్సిటీ అధ్యాపక వర్గాలు భావిస్తున్నాయి. వర్సిటీలో పరిపాలన, బోధన, బోధనేతర సమస్యలతో పాటు సంస్థాగతమైన అనేక ఇబ్బందులున్నాయి. రీసెర్చ్‌తో పాటు క్లాస్‌వర్క్‌లోనూ వెనుకబడింది. వీటన్నింటినీ అధిగమించాలంటే సమర్థవంతులైన వీసీ రావాలనే భావన విద్యావేత్తల్లో నెలకొంది.

సెర్చ్ కమిటీ

రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారితో పాటు మరో ఇద్దరు సభ్యులతో సెర్చ్ కమిటీని నియమించారు. కేయూ సెర్చ్ కమిటీలో జమ్మూ కశ్మీర్‌లోని సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్ సంజీవ్ జైన్, వర్సిటీ పాలక మండలి నామినీ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ ఎ.దామోదర్, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతకుమారిలు సభ్యులుగా ఎంపికయ్యారు.

పీహెచ్‌డీ సీట్ల కోసం ఆందోళనలు

- సెల్ టవర్ ఎక్కి విద్యార్థుల నిరసన
- సర్ది చెప్పిన రిజిస్ట్రార్ మల్లారెడ్డి, డీన్లు, అధికారులు

కేయూ క్యాంపస్, అక్టోబరు 3: కేయూలో పీహెచ్‌డీ సీట్ల అడ్మిషన్లలో న్యాయం చేయాలని కోరుతూ గురువారం విద్యార్థులు నిరసన, ఆందోళనకు దిగారు. తమకు న్యాయం చేయా లంటూ ఏకంగా వర్సిటీ పరిపాలన భవనంలో పురుగుల మందుల డబ్బాలను పట్టుకుని హల్‌చల్ చేశారు. అలాగే వర్సిటీలోని సెల్ టవర్ ఎక్కి ఆత్మహత్యాయత్నానికి దిగడంతో కొద్దిసేపు వర్సిటీలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. వర్సి టీ పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్లలో తమకు న్యా యం చేయాలని అనేక దఫాలుగా జిల్లా మం త్రులు, కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. అయితే రిజిస్ట్రా ర్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పీహెచ్‌డీ కేటగిరి-2 అడ్మిషన్ల విషయంలో తప్పుడు


సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

సమాచారం ఇచ్చారని ఆరోపించారు. దీంతో తమకు అడ్మిష న్లలో అన్యాయం జరుగుతోందని ఆరోపిం చారు. గతంలో పీహెచ్‌డీ సీట్ల కోసం తాము ఆందోళనలు చేశామని, రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చామన్నారు. సీఎం రేవం త్‌రెడ్డి, ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణలు కల్పించుకుని పీహెచ్‌డీ అశావహులైన మిగతా విద్యార్థులకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్‌కు అప్పగిస్తే పట్టించుకోకుండా అడ్డుపడుతున్నారని ఆరోపించారు.

విద్యార్థులను మానసికంగా వేధిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ధ్వజమెత్తారు. తమకు న్యాయం చేయకుంటే ఆత్మహత్యలు చేసుకుంటామని హెచ్చరించారు. ఈ విషయం తెలుసుకున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ ప్రొఫెసర్ బి. సురేశ్‌లాల్, డాక్టర్ చిర్ర రాజులు ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వచ్చి సముదాయించారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వ గా, శాంతించి సెల్ టవర్ దిగారు. ఈ నిరసన ఆందోళనల్లో పీహెచ్‌డీ అశావహులైన మంద నరేశ్, బొట్ల మనోహర్, బందిగ రాకేశ్, తిరుపతి నాయక్, సోరుపాక అనిల్ తదితరులు పాల్గొన్నారు.

హీరో గ్లామర్ ఓజీ ఆవిష్కరణ

బాలసముద్రం, అక్టోబరు 3: హనుమకొండ శ్రీ వైష్ణవి ఆటోమొబైల్స్ షోరూమ్‌లో హీరో గ్లామర్ ఓజీ (ఒరిజినల్)వాహనాన్ని గురువారం షోరూమ్ అధినేత చందుపట్ల సత్యపాల్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన వాహనం ప్రత్యేకతలు గురించి తెలియజేశారు. గ్లామర్ ఓజీ 125 సీసీ హెచ్చు సింబల్ ఎల్ఈడీ ప్రొజెక్టర్, హెడ్ ల్యాంప్, పుల్లీ డిజిటల్ స్పీడ్ మోటార్స్, ఇండికేట్స్, ఇండికేటర్ హాజార్డ్ స్విచ్, అలాగే సెల్ఫ్ స్టార్ట్ ఇంజన్, కట్ ఆఫ్ స్విచ్ ఈ వాహన ప్రతేకతలని తెలిపారు.

లీటర్‌కు మైలేజీ 65 కిలోమీటర్లు వస్తుందన్నారు. ఈ పండుగకు రెగ్యులర్ గ్లామర్ వాహనాలకు 3000 నుంచి 5000 వరకు నగదు బెనిఫిట్స్ ఇస్తున్నామన్నారు. వినియోగదారులు ఈ ఆఫర్లను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ మధు, సర్వీసు మేనేజర్ జబ్బార్, ఫైనాన్షియర్స్, ఇన్సూరెన్స్ మేనేజర్స్ కస్టమర్లు తదితరులు పాల్గొన్నారు.


హీరో గ్లామర్ ఓజీని ఆవిష్కరిస్తున్న చందుపట్ల సత్యపాల్‌రెడ్డి

సందడిగా జిల్లా స్థాయి ఎంపిక పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని డీఎస్ఏ బాక్సింగ్ హాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు సందడిగా గురువారం ప్రారంభమయ్యాయి. జూనియర్స్, సబ్ జూనియర్స్ బాలబాలికల విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో 40మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రాజేందర్ తెలిపారు. ఇక్కడ జిల్లా స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి క్రీడాకారులను ఈనెల 5, 6 తేదీలలో హైదరాబాద్ షేక్‌పేటలోని స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని బాక్సింగ్‌హాల్లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్, సభ్యులు గిరిధర్, రఘు, కృష్ణమూర్తి, సీని యర్ బాక్సర్లు రెబాన్, దివ్య, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

రేపు పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలం

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలను శనివారం వేలం వేయనున్నట్లు సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. రిపేర్ చేయబడిన బ్యాటరీలు, టైర్లు, విడిభాగాలను వేలంలో అందుబా టులో ఉంచుతామని, ఆసక్తి గల వ్యక్తులు శనివారం ఉదయం 10 గంటలకు కమిషరేట్ కార్యాలయంలోని మోటర్ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ (యంటీవో)లో సంప్రదించాలన్నారు.

కొనసాగుతున్న డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన


వరంగల్ జిల్లా అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 3: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. ఈ నెల 5 వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. గురువారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనలో వరంగల్ జిల్లాలో ఎస్జీటీలకు సంబంధించిన 372మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలనను పూర్తిచేసినట్లు డీఈవో ఎం.జ్ఞానేశ్వర్ తెలిపారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించిన 10అభ్యర్థుల సర్టిఫికెట్లు పరిశీలన పూర్తి చేశామన్నారు.

మొత్తం 382 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయ్యింది. ఇక హనుమకొండ జిల్లాలో మొత్తం 233 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయినట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, రాష్ట్ర పరిశీలకురాలు జేడీ విజయలక్ష్మి ప్రభుత్వ డైట్ కళాశాల, సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేసిన పరిశీలన కేంద్రాలను సందర్శించారు. సర్టిఫికెట్ల పరిశీలన తీరును ఆమె డీఈవోలను అడిగి తెలుసుకుని సమీక్షించారు.

సెమీ ఫైనల్స్‌కు చేరిన కరీంనగర్, ఖమ్మం జిల్లా జట్లు

కొనసాగుతున్న అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, అక్టోబరు 3: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) సహకారంతో వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీలు సెమీఫైనల్స్‌కు చేరుకున్నాయి. పూల్ బీలోని ఖమ్మం - నిజామాబాద్ జట్ల మధ్య గురువారం కోమటిపల్లి క్రీడామైదానంలో నిర్వహించిన కీలక మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటిం గ్ ఎంచుకున్న నిజామాబాద్ జిల్లా జట్టు నిర్ణీత 45 ఓవర్లను ఎదుర్కొని 207భారీ స్కోరును సాధిం చింది. నిజామాబాద్ జట్టు ఓపెనర్ ప్రతాప్ 48పరుగులు చేయగా, మరో బ్యాట్స్‌మెన్ విక్రాంత్ రెడ్డి 98 బంతులను ఎదుర్కొని 11 బౌండరీలు, 11 సిక్సర్లతో 137 పరుగులు జట్టుకు అందించి భారీ పరుగుల విజయ లక్ష్యన్ని ఖమ్మం జట్టు ముందుం చాడు. కాగా, 208 పరుగుల భారీ లక్ష్య సాధనలో బ్యాటింగ్ బరిలోకి దిగిన ఖమ్మం జట్టు బ్యాట్స్‌మెన్లు దివిన్ 75 పరుగులు, రత్న ఆర్యన్‌ల 45 పరుగులతో రాణించారు. ఇదే జట్టులోని బౌలర్ ధృవతేజా 4వికెట్లు తీసి ప్రత్యర్థి నిజామాబాద్ జట్టు పరుగులను కట్టడి చేయడంతో పాటు 8వ డౌన్ బ్యాటింగ్ బరిలోకి దిగి 26 పరుగుల పార్ట్‌నర్‌షిప్‌తో తమ జట్టు విజయంలో కీలక భూమిక పోషించి ఖమ్మం జట్టు సెమీస్ చేరడంతో కీలక భూమిక పోషించాడు. అదేవిధంగా పూల్ బీలోని ఆదిలాబాద్ - కరీంనగర్ జట్ల మధ్య వరంగల్‌లోని మొగిలిచర్ల క్రీడా మైదానంలో నిర్వహించిన పోరులో 63పరుగుల భారీ తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జట్టు విజయం సాధించింది.


98 బాల్స్‌లో 137 పరుగులు సాధించిన విక్రాంత్

టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కరీంనగర్ జట్టు నిర్ణీత 50ఓవర్లకు గాను 46.3 ఓవర్లను ఎదుర్కొని 165 గౌరవప్రదమైన పరుగులు సాధించి ఆలౌట్ కాగా, ఇదే జట్టుకు చెందిన బ్యాట్స్‌మెన్ విజ్ఞన్ 59పరుగులతో రాణించాడు. తదుపరి 166 పరుగుల లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన ఆదిలాబాద్ జట్టు కేవలం 32. 3ఓవర్లను ఎదుర్కొని 102 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. దీంతో 63 పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టుపై కరీంనగర్ జిల్లా జట్టు విజయకేతనం ఎగరవేసి సెమీ ఫైనల్‌కు చేరింది. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, సభ్యులు మట్టెడకుమార్ బండారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

బాలత్రిపుర సుందరిగా భద్రకాళి

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు షురూ
- అమ్మవారికి బంగారు కిరీటం అలంకరణ

వరంగల్ కల్చరల్, అక్టోబరు 3: స్వయంభూగా కొలువుదీరిన ఓరుగల్లులోని చరిత్రాత్మకమైన భద్రకాళి అమ్మవారి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం అట్టహాసంగా ఆరంభమయ్యాయి. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. తొలిరోజు శైలిపుత్రి క్రమంలో అమ్మవారిని బాలత్రిపుర సుందరీగా అలంకరించారు. ప్రధానార్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో నిత్య, గణపతి, గురుపూజలతో పాటు సుగంధ పరిమళ పూర్ణాభిషేకం, నవరాత్రి వ్రతం ఆరంభం, ధ్వజారోహణం, కలశస్థాపన చేశారు. వీటితో పాటు చండీహోమం, వేద పారాయణం, లక్ష్మీనారాయణ, వనదుర్గా, దేవీ భాగవతం, సుందర కాండ, శ్రీమద్భాగవతం పారాయణాలు, విశేషపూజలు, మహా పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం బహూకరించిన బంగారు కిరీటాన్ని బ్యాంకు నుంచి తీసుకొచ్చి అలంకరించారు. ఉదయం అమ్మవారు వృషభ వాహనంపై ఊరేగగా సాయంత్రం 7 గంటలకు యోగా నిద్రాక్రమంలో మృగ జింక వాహనంపై అమ్మవారు ఊరేగారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శిం చుకున్నారు. భక్తులకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈవో శేషు భారతి ఉత్సవాల్లో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, కూచన హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నైపుణ్యత పెంపొందించుకోవాలి

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: పోలీసు అధికారులు విధుల్లో రాణించాలంటే వృత్తిలో నైపుణ్యత సాధించాలని సీపీ అంబర్ కిషోర్ ఝా సూచించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆవరణలో గురువారం జోనల్ స్థాయి పోలీస్ డ్యూటీ మీట్ పోటీలను సీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా నేరస్థులను త్వరితగతిన పట్టుకోవడంతో పాటు ప్రజలకు సత్వరమే న్యాయం అందించగలరన్నారు. కాగా, ఈ మీట్‌లో అధికారులు, సిబ్బంది నిరంతరం విధి నిర్వహణలో చేపట్టే ఫోరెన్సిక్ సైన్స్, ఫింగర్ ప్రింట్స్, హ్యాండ్లింగ్, ప్యాకింగ్ లిఫ్టింగ్, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్, ఫొటో, వీడియోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామన్నారు. ఈ పోటీల్లో విభాగాల వారీగా ప్రతిభ చూపిన ఇద్దరిని ఎంపిక చేసి ఈ నెలలో హైదరాబాద్‌లో నిర్వహించే ప్రథమ పోలీస్ డ్యూటీ మీట్‌కు పంపిస్తామన్నారు. ఈ మీట్‌లో జోనల్ పరిధిలోని వరంగల్ పోలీస్ కమిషనరేట్, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం పోలీసులు పాల్గొన్నారు.

రూ.10 లక్షల గుట్కాల పట్టివేత

హనుమకొండ టౌన్, అక్టోబరు 3: హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నిషేధిత గుట్కాలను పెద్ద మొత్తంలో నిల్వ చేసి గుట్టుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న వ్యక్తుల నుంచి రూ.10లక్షల విలువ చేసే గుట్కాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి సీజ్ చేశారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల కథనం ప్రకారం.. హనుమకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుట్కా విక్రయాలు జోరుగా సాగుతున్నాయనే పక్కా సమాచారం మేరకు కుమార్‌పల్లి మార్కెట్‌లోని లక్ష్మీ జనరల్ స్టోర్ నిర్వాహకుడు రాజ్‌పురోహిత్ నుంచి రూ. 6,04,800 విలువ చేసే వివిధ నిషేధిత గుట్కాలు, శివమ్ జనరల్ స్టోర్స్ నిర్వాహకుడు కిరణ్ నుంచి రూ.3,58,300 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు తెలిపారు.

ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలో..

హనుమకొండ టౌన్ : ఏనుమాముల పీఎస్ పరిధిలో కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం భారీ మొత్తంలో గుట్కాలను పట్టుకున్నారు. టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ కథనం ప్రకారం.. పక్కా సమాచారం మేరకు గురువారం వరంగల్ ఎన్టీఆర్ నగర్‌లో హుజూరాబాద్ మండలం ఇప్పల్ నర్సింగపూర్‌కు చెందిన గుట్కా సరఫరాదారుడు రావి శ్రీధర్, స్థానికుడైన పాన్‌షాపు నిర్వాహకుడు గుండ క్రిష్ణల నుంచి రూ.8,91,100 విలువ చేసే గుట్కాలను పట్టుకొని సీజ్ చేసినట్లు తెలిపారు.

దండకారణ్యంలో ఏం జరుగుతోంది ?

- కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం!
- చర్చనీయాంశంగా మారిన మావోయిస్టుల రాక
- పోలీసుల ఆరా

వాజేడు, అక్టోబరు 3: దండకారణ్యం నివురుగప్పిన నిప్పులా ఉంది. ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి మావోయిస్టులు తెలంగాణలోకి ప్రవేశించినట్టు ప్రచారం జరుగుతోంది. మండలంలోని కోయవీరాపురం అడవుల్లో నాలుగు రోజుల క్రితం మావోయిస్టులు సమావేశమైనట్టు సమాచారం. గ్రామంలోకి సాయుధులైన మావోయిస్టులు అర్ధరాత్రి వేళ ప్రవేశించి సమావేశం నిర్వహించినట్టు తెలుస్తోంది. ఇటీవల జరిగిన వారోత్సవాల నేపథ్యంలో మావోయిస్టులు కోయవీరాపురంలో భేటీ అయి తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. ఓ వైపు డీజీపీ తెలంగాణలో మావోయిస్టులు లేరని ప్రకటనలు చేస్తున్న క్రమంలో ఏజెన్సీ మండలమైన వాజేడులో మావోయిస్టులు ఈ సమావేశం నిర్వహించారనే విషయం సంచలనంగా మారింది. మావోయిస్టులు తమ పార్టీ కార్యకలాపాలను చాపకింద నీరులా నిర్వహిస్తున్నట్టు తెలుస్తుండగా ప్రశాంతంగా ఉన్న వాజేడు మండల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

కొన్నేళ్లుగా వాజేడులో మావోయిస్టుల కార్యకలాపాలు స్తబ్దుగా ఉన్న నేపథ్యంలో తాజా సంఘటన టార్గెట్‌గా ఉన్న నేతలను కలవరపెడుతోంది. ముఖ్యంగా అధికార, ప్రతిపక్ష రాజకీయ నాయకుల్లో ఆందోళన నెలకొన్నట్టు సమాచారం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం, జిల్లాలోని వెంకటాపురం(నూగూరు) సరిహద్దు అడవుల్లో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉంటాయి. ప్రస్తుతం వాజేడు మండలంలో మావోయిస్టులు సమావేశం నిర్వహించడంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. దండకారణ్యంలో ఏం జరుగుతుందోనని సరిహద్దు గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు.

పోలీసుల అదుపులో గిరిజనులు ?

కోయవీరాపురం అడవుల్లో మావోయిస్టులు సమావేశం నిర్వహించారనే అంశంపై పోలీసులు కూపీ లాగుతున్నట్లు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశం ఆలస్యంగా పోలీసుల చెవిన పడడంతో తమకు ఉన్న నిఘా వ్యవస్థతో వివరాలు సేకరిస్తున్నట్టు సమాచారం. కోయవీరాపురానికి చెందిన ఓ 10 మంది గిరిజనులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్టు తెలుస్తోంది. మావోయిస్టుల సమావేశంలో పాల్గొన్నారా.. ? లేదా సహకరించారా ? అని ఆరా తీస్తున్నట్లు సమాచారం. సీఐతో పాటు పలువురు ఎస్సైలు ఈ కీలక ఘటనపై వివరాలు సేకరించే పనిలో ఉన్నట్లు తెలిసింది. మావోయిస్టులు, పోలీ సుల మధ్య అమాయక గిరిజనులు నలుగుతున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతుండగా మావోయిస్టుల సమావేశంపై ఇప్పటి వరకు పోలీసు వర్గాలు అధికారి కంగా ధ్రువీకరించలేదు.

సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మంత్రి

ఏటూరునాగారం రూరల్, అక్టోబరు 3: సీఎం రేవంత్‌రెడ్డి గురువారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారిలతో కలిసి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాగా, జిల్లా పర్యటనలో బీజీగా ఉన్న పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క మండలకేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో సీఎం రేవంత్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లు, డీఎస్సీ సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ అపాయింట్‌మెంట్ తదితర అంశాలపై సీఎం అధికారులతో చర్చించారు. ఆమె వెంట కలెక్టర్ టీఎస్ దివాకర ఉన్నారు.

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 3: కాళేశ్వరం ప్రాజెక్టులో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది. గురువారం బ్యారేజీలోకి 1.40 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. కాగా, బ్యారేజీ వద్ద 2.60 మీటర్ల ఎత్తులో ప్రవాహం కొనసాగుతోంది.

కక్ష సాధింపు చర్యలకు దిగుతున్న మంత్రి

కాటారం, అక్టోబరు 3: రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అభివృద్ధి మరిచి ప్రశ్నించే వారిపై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని బీజేపీ రాష్ట్ర నేత చల్ల నారాయణరెడ్డి విమర్శించారు. మండల కేంద్రంలోని స్వగృహంలో పలువురు బీజేపీ నాయకులతో కలిసి నారాయణరెడ్డి విలేకరులతో మాట్లాడుతూ... మంత్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని అభివృద్ధిపై విమర్శలు చేసే తనపై పోలీసులు ద్వారా నాలుగు కేసులు పెట్టించారని ఆరోపించారు. సమావేశంలో బీజేపీ మండలాధ్యక్షుడు బండం మల్లారెడ్డి, నాయకులు బొమ్మన భాస్కర్‌రెడ్డి, సంపత్, డోలి అర్జయ్య రాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రముఖ వైద్యుడు ప్రధాన్ అన్నారు. గురువారం పట్టణంలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో పిల్లల కోసం నిర్వహిస్తున్న ఉచిత పర్సనాలిటీ డెవలప్‌మెంట్ తరగతులకు ఆయన హాజరై పిల్లల మానసిక వ్యక్తిత్వాన్ని వికసింపజేసే ప్రసంగాన్ని చేశారు. యోగాతో పిల్లలకు జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని, అలాగే మానసికంగా బలంగా తయారవుతారని అన్నారు. కార్యక్రమంలో యోగాచార్యులు మాధవాచారి, తాటి వెంకన్న, వంశీకృష్ణ, సతీష్, శ్యాం, రవీందర్, శేఖర్, రాంబాబు పాల్గొన్నారు.

ఎంపీడీవోకు సీబీఐ పేరుతో ఫేక్ కాల్

వెంకటాపూర్(రామప్ప), అక్టోబరు 3: వెంకటాపూర్ ఎంపీడీవో మూడ్ రాజు నాయక్‌కు సీబీఐ పేరుతో బుధవారం రాత్రి ఓ ఫేక్ కాల్ వచ్చింది. కాగా, తన కుమారుడు మా వద్ద ఉన్నాడంటూ బెదిరిస్తూ మాట్లాడుతున్న క్రమంలో అప్రమత్తమై అసలు మీరెవరు, మీ పేరేంటి అనడంతో ఫోన్ కట్ చేశారని ఎంపీడీవో తెలిపారు. ఇటీవల కలెక్టర్ పేరుతో ఓ ఫేక్ అకౌంట్ కూడా క్రియేట్ చేసి సైబర్ నేరగాళ్లు వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో కూడా వెంకటాపూర్ మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ అకౌంట్ నుంచి డబ్బులు మాయమైన సంఘటనలు కూడా ఉన్నాయి. కాగా, ఇలాంటి ఘటనలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై జక్కుల సతీష్ పేర్కొన్నారు.

కార్మికుల ఖాతాల్లో దసరా అడ్వాన్స్ పైసలు

ఏరియాలో 5,044 మంది కార్మికులకు లబ్ధి

కాకతీయఖని, అక్టోబరు 3: సింగరేణి కార్మికుల ఖాతాల్లో దసరా అడ్వాన్స్ పైసలు జమయ్యాయి. యాజమాన్యం గురువారం కార్మికుల వేతనాలతో పాటు దసరా అడ్వాన్స్ సొమ్మును జమ చేసింది. భూపాలపల్లి ఏరియాలో 5,044 మంది హిందూ కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో రెగ్యులర్ కార్మికులు 4,624 మంది ఉండగా ఒక్కొక్కరికి రూ.25వేల చొప్పున మొత్తం రూ.11,56,00,000 చెల్లించింది. అలాగే 420 మంది బదిలీ కార్మికులు పనిచేస్తుండగా ఒక్కొక్కరికి రూ.12,500 చొప్పున మొత్తంగా రూ.52.50 లక్షలు జమ చేసింది. కాగా, ఏరియాలో పనిచేస్తున్న రెగ్యులర్, బదిలీ కార్మికులకు రూ.12,08,50,000 చెల్లించినట్లు అధికారులు తెలిపారు.

కుక్కల వృద్ధి నియంత్రణ కేంద్రాన్ని సిద్ధం చేయాలి

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3 : కుక్కల వృద్ధి నియంత్రణ కేంద్రాన్ని వెంటనే సిద్ధం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మునిసిపల్ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా గురువారం కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పట్టణంలోని హనుమాన్‌నగర్‌లో ఏర్పాటు చేయనున్న కుక్కల వృద్ధి నియంత్రణ కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శస్త్ర చికిత్సల అనంతరం కుక్కలు ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ తదుపరి కుక్కలను విడిగా ఉంచాల్సిన అవసరం ఉన్నందున ఐరన్ సీజ్ చేయాలని అన్నారు. కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కమిషనర్ రాజేశ్వర్, ఏఈ మానస తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్ రూరల్, అక్టోబరు 3: గ్రామంలోకి వచ్చే అపరిచిత వ్యక్తుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ ఎస్సై పవన్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని రాపల్లికోట గ్రామంలో కాళేశ్వరం ఎస్సై చక్రపాణితో కలిసి కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం గ్రామస్తులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామంలో గుడుంబా విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు ఉంటాయన్నారు. చట్టవిరుద్ధమైన, అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. యువత బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అన్నారు. గ్రామంలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను వివరించి వాటి ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు కిషన్, తిరుపతి, అనంత్, చంద్రమోహన్, స్పెషల్ పార్టీ, ప్రత్యేక బలగాలు పాల్గొన్నాయి.

గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తాం

పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం..

రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



జంగాలపల్లిలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 3: రానున్న కొన్ని రోజుల్లో ములుగు జిల్లా లోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తామని, ఆయా శాఖల అధికారులు మంజూరైన రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. గురువారం ములుగు మండలంలోని జంగాలపల్లి క్రాస్ నుంచి ఎరుకలవాడ వరకు రూ.80 లక్షలతో రోడ్డు పనులకు కలెక్టర్ టీఎస్.దివాకరతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ పంచాయతీరాజ్, ఐటీడీఏ, ఆర్‌అండ్‌బీ శాఖల ద్వారా సుమారు రూ.140 కోట్ల నిధులతో రోడ్ల పనులు చేపట్టడం జరుగుతుందని, 30 సంవత్సరాల గ్రామీణ ప్రాంతాల ప్రజల కల నెరవేరబోతున్నదని అన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టిన రోడ్ల పనులను రెండు, మూడు నెలల్లో పూర్తిచేసే విధంగా చొరవ చూపాలన్నారు. ఇటీవల రూ.33 కోట్లతో జంగాలపల్లి నుంచి అంకన్నగూడెంవరకు రోడ్డుపనులకు శంకుస్థాపన చేశామని తెలిపారు.

ములుగు జిల్లా పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధికెక్కడంతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, దేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన సమ్మక్క-సారలమ్మలు, లక్నవరం సరస్సు వంటి ప్రాంతాలను జాతీయ రహదారితో అనుసంధానం చేస్తూ రోడ్డు వెడల్పు కార్యక్రమాలు చేపట్టబోతున్నామని మంత్రి సీతక్క తెలిపారు. అత్యవసర సమయంలో ప్రతి ఒక్కరికి రోడ్డుతో అవసరం ఉంటుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ములుగు నియోజకవర్గానికి గతంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా నిరుపేదలకు అధిక మొత్తంలో ఇళ్ల నిర్మాణం చేపట్టాలనే ఉద్దేశంతో 5వేల ఇళ్లను మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. రానున్న రోజుల్లో ములుగు జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. త్వరలో నిరుపేదలకు రూ.5లక్షలతో ఇందిరమ్మ పేరుతో నిర్మించే ఇంటి నిర్మాణ పనులను పూర్తిచేసి సొంతింటి కలను నెరవేరుస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ వీరభద్రం, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ములుగు మండలంలోని మల్లంపల్లి గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు నూనేటి ఐలయ్య కుటుంబాన్ని మంత్రి సీతక్క గురువారం పరామర్శించారు. ఈసందర్భంగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసి పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, బ్లాక్, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'డిజిటల్ కార్డు సర్వే పకడ్బందీగా చేపట్టాలి'

గణపురం, అక్టోబరు 3: డిజిటల్ కార్డుసర్వే ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని బుర్రకాయలగూడెంలో జరుగుతున్న డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను పరిశీలించి మాట్లాడారు. భూపాలపల్లి నియోజకవర్గంలో భూపాలపల్లి మునిసిపాలిటీ 22వ వార్డు, బుర్రకాయలగూడెంను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సర్వే ప్రక్రియకు ఆర్డీవో మంగీలాల్‌ను నియమించామని తెలిపారు. రెండు టీములుగా ఏర్పరచి, ప్రతీ టీమ్‌కు ముగ్గురు సభ్యులను నియమించామన్నారు. ప్రతీ డిజిటల్ కార్డులో సమగ్ర కుటుంబ వివరాలు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఐదు రోజుల్లో ఈ సర్వే పూర్తి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సత్యనారాయణస్వామి, ఎంపీడీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విధానాలను తిప్పికొట్టాలి : సీపీఎం

చిట్యాల, అక్టోబరు 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో గురువారం మండల పార్టీ మూడవ మహాసభలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ మతోన్మాద విధానాలతో గ్రామాల్లో ఘర్షణ వాతావరణం సృష్టిస్తుందని విమర్శించారు. బడ్జెట్‌లో వ్యవసాయం, ఉపాధి హామీకి నిధులు తగ్గించారని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి దళితులు, ఆదివాసీ కార్మికులపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు జిల్లా కమిటీ సభ్యుడు చింతల రజినీకాంత్ పార్టీ జెండా ఆవిష్కరించాడు. సమావేశంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు గుర్రం దేవేందర్, ఆకుదారి రమేష్, భూక్య నవీన్, వినోద్, రాజమణి, కుమార్, రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

సరైన పత్రాలు లేని ఫర్టిలైజర్ షాపు, గోదాం సీజ్

కాటారం, అక్టోబరు 3: మండల కేంద్రంలోని క్రాంతి కుమార్ ట్రైడర్స్ ఫర్టిలైజర్స్ షాప్, గోదాంను వ్యవసాయాధికారులు 15 రోజుల పాటు సీజ్ చేశారు. మహాముత్తారం మండలం యామన్‌పల్లికి చెందిన రత్నం రామచంద్రం అనే రైతు సదరు ఫర్టిలైజర్ షాపులోని మందు పిచికారి చేయగా పత్తి పంటకు నష్టం వాటిల్లిందని ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో గురువారం ఏడీఏ శ్రీపాల్, ఏవో పూర్ణిమ, ఎస్సై అభినవ్ తనిఖీలు చేశారు. క్షేత్రస్థాయిలో పత్తి పంటను పరిశీలించి నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. రైతు వద్ద మందుకు సంబంధించిన రసీదు, డబ్బా లేకపోవడంతో అధికారులు గోదాం, షాపులో తనిఖీలు నిర్వహించారు. సంబంధిత మందు డబ్బాలు కనిపించలేదు. సరైన అనుమతి పత్రాలు లేకుండా పురుగు మందులు, గ్రోత్ ప్రమోటర్ మందులు ఉంచడంతో అధికారులు స్టాప్ సేల్ చేసి, పత్రాలను 15 రోజుల్లో చూపించాలని ఆదేశించారు. తాత్కాలికంగా షాపు, గోదాంకు తాళం వేశారు. కార్యక్రమంలో ఏఈవోలు సరిత, రాజన్న, శివకుమార్, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ఫిట్ సెక్రటరీగా శ్రీనివాస్

కాకతీయఖని, అక్టోబరు 3: సింగరేణి భూపాలపల్లి ఏరియాలోని కేటీకే-6వ గని ఎస్సీ, ఎస్టీ కార్మిక సంఘం ఫిట్ సెక్రటరీగా కుమ్మరి శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు ఆ సంఘం బ్రాంచి ఉపాధ్యక్షుడు చక్రపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీగా జె.రాజన్నను, కార్యవర్గ సభ్యులుగా అజయ్‌కుమార్, అంజి, తిరుపతి, రాజలింగు, గోపితో పాటు మరో నలుగురిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

సమాజం తలదించుకునేలా మంత్రి వ్యాఖ్యలు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), అక్టోబరు 3: సభ్య సమాజం తలదించుకునేలా మంత్రి సురేఖ వ్యాఖ్యలు ఉన్నాయని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి అన్నారు. భూపాలపల్లిలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. గౌరవ ప్రదమైన పదవిలో ఉండి కేటీఆర్ వల్లే నాగచైతన్య-సమంత విడిపోయారనడం సిగ్గు చేటన్నారు. సినీ ఇండస్ట్రీ మొత్తం ఆమె వ్యాఖ్యలపై మండిపడుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ వస్తుందన్నారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి, కౌన్సిలర్లు నూనె రాజు, ముం జంపల్లి మురళీధర్, నాయకులు కళ్లెపు రఘుపతిరావు, సెగ్గం సిద్దు, భారత జాగృతి జిల్లా అధ్యక్షుడు మాడహరీష్‌రెడ్డి, నాయకులు జనార్ధన్, చిరంజీవి, రాములుపాల్గొన్నారు.

రావణాసుర వధ ఉత్సవ స్థలాన్ని పరిశీలించిన ఎస్సై

ములుగు కలెక్టరేట్, అక్టోబరు 3: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని ములుగు జిల్లాకేంద్రంలో ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో నిర్వహించే రావణాసుర వధ ఉత్సవ స్థలాన్ని గురువారం స్థానిక ఎస్సై వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పట్టణంలోని స్థూపం సమీపంలో గల ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిరకాల ఏర్పాట్లు చేయాలన్నారు. అగ్నిమాపక, అంబులెన్స్ సేవలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గండ్రకోట కుమార్, ఉపాధ్యక్షులు ఓడ రాజు, కొత్త సురేందర్, గండె రాజు, మాదరి జనార్దన్, జర్పుల పవన్, భూమ నరేష్, చంటి పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి వ్యక్తి మృతి

టేకుమట్ల, అక్టోబరు 3: మండలంలోని ద్వారకపేటకు చెందిన తిప్పిరెడ్డి భూమిరెడ్డి (48) గురువారం ప్రమాదవశాత్తు బావిలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన ప్రకారం... తిప్పిరెడ్డి భూమిరెడ్డి తన వ్యవసాయ బావిలోని మోటార్‌ను పైకిలాగే క్రమంలో ప్రమాదవశాత్తు కాలు జారి బావిలోపడి మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు భార్య దేవకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రేకుల షెడ్డు నిర్మాణాన్ని కూల్చేసిన జీపీ అధికారులు

కాటారం, అక్టోబరు 3: మండలంలోని దామెరకుంట గ్రామపంచాయతీ పరిధిలో దుబ్బపల్లి వద్ద గల రైతు వేదిక సమీపంలో ప్రభుత్వ స్థలంలో రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టారు. రాత్రికి రాత్రే నిర్మాణం చేపట్టగా పలువురు పంచాయతీ కార్యదర్శి గంగాధరన్‌కు సమాచారం అందించారు. దీంతో కార్యదర్శి గంగాధరన్ ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది షెడ్డును కూల్చివేశారు. ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వయోవృద్ధులను గౌరవించడం అందరి బాధ్యత

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



వృద్ధులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు, కలెక్టర్

కృష్ణకాలనీ(భూపాలపల్లి), అక్టోబరు 3: వయోవృద్ధులను గౌరవించడం ప్రతీ ఒక్కరి బాధ్యత అని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మంజూర్‌నగర్‌లో గల కలెక్టరేట్‌లో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, వారికి అవసరమైన సహాయం అందించడంలో రాజీ ఉండదన్నారు. నేటి సమాజంలో ఉన్నతులుగా ఎదిగిన తరువాత సంతానం తల్లిదండ్రుల ఆలానా, పాలనా విస్మరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇబ్బందులకు గురయ్యే వయోవృద్ధులు జిల్లా సంక్షేమాధికారికి, 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు గానీ ఫిర్యాదు చేయాలన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ వయోవృద్ధుల అనుభవాలను నేటి తరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో విజయలక్ష్మి, సంక్షేమ శాఖ అధికారి చెన్నయ్య, డీపీవో నారాయణరావు, సీడీపీవో అవంతి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



నైన్‌పాకలో చీరలు అందజేస్తున్న మధువంశీకృష్ణ, ఏటూరునాగారంలో ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు, రాజుపేటలో అమ్మవారిని దర్శనం చేసుకొంటున్న భక్తులు

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3: జిల్లాలో దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీ, రెడ్డికాలనీ, మెయిన్‌రోడ్డు, కృష్ణకాలనీలో దుర్గాదేవిని భక్తులు నెలకొల్పారు. మొదటి రోజు ప్రత్యేక పూజలు చేశారు. పిల్లాపాపలతో కలిసి వేడుక చేశారు. వివిధ పార్టీల నాయకులు మాడ హరీష్‌రెడ్డి, యాపిల్ బాలు ప్రత్యేక చొరవ చూపి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

- గణపురం: మండలంలోని బుద్దారం శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవి పూజలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సతీమతి పద్మతో కలిసి పాల్గొన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ ప్రాంతమంతా పంటలు సమృద్ధిగా పండి రైతులంతా సుఖశాంతులతో ఉండాలని ఆకాంక్షించారు.
- కాటారం: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ధన్వాడ దత్తాత్రేయ ఆలయంలో, కాటారంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో, గూడూరులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి విగ్రహాలను నెలకొల్పి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వేద పండితులు కృష్ణమోహన్‌శర్మ, నాగరాజు, సుమిత్, లక్ష్మీకాంత్, ఆర్యవైశ్య సంఘం నాయకులు అనంతుల శ్రీనివాస్, పవిత్రం శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, రమేష్‌బాబు, నగేష్, నందకిషోర్, అంజయ్య, ప్రకాష్, మహిళలు పాల్గొన్నారు.
- మల్హర్: మండల కేంద్రమైన తాడిచర్లతో పాటు పలు గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తాడిచర్ల గ్రామంలో గౌండ్లపల్లి, రేగడిపల్లి, ఓసీపీలో మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారిని ప్రతిష్ఠించారు. అలాగే రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. మహిళలు మంగళహారతులతో ముందుకు సాగారు.
- చిట్యాల: మండలంలోని పలు గ్రామాల్లో దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. మండలకేంద్రంలోని శ్రీప్రసన్నాంజనేయ ఆలయం, నూతన బస్టాండ్, వెంకట్రావుపల్లి, తిరుమలాపురం, చల్లగరిగ రామాలయం, శివాలయం, గోపాలపురం, జడలపేట రామాలయం, నైన్‌పాక శ్రీరామకృష్ణ పరమహంస మందిరంలో దుర్గామాత విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఊరేగింపుగా దుర్గామాత విగ్రహాలను మండపాలకు తీసుకువెళ్లి అమ్మవారికి పూజలు చేశారు.

శరన్నవరాత్రులకు చీరలు అందజేత

దుర్గామాత శరన్నవరాత్రుల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ నిర్వాహకులకు చీరలను అందజేశారు. మండలంలోని చింతల్లపల్లి, తిర్మలాపురం, గోపాలపురం, జడలపేట, నైన్‌పాక గ్రామాల్లో దుర్గామాత మండపాలను సందర్శించి 10 చీరల చొప్పున సమర్పించారు. దుర్గాదేవీ ఆశీస్సులతో మండల ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాపాక ఉత్సవ కమిటీ ఛైర్మన్ యాదండ్ల రాజయ్య, నక్క భాస్కర్, సుదగాని ప్రభాకర్, శ్రీరామకృష్ణ పరమహంస ట్రస్టు నైన్‌పాక ఛైర్మన్ నరేందర్ స్వామి, కంచర్ల రమేష్, మహేష్, నూక వీరయ్య, రాజు, నక్క రవి, చిన్నాల శ్రీనివాస్, శివ, రమేష్, విజేందర్ పాల్గొన్నారు.

- ఏటూరునాగారం: మండలంలో దేవీ శరన్నవరాత్రుల అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని ఉత్సవ కమిటీ సభ్యులు బాలాత్రిపురసుందరిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి, రామాలయం, శివాలయం, సాయిబాబా ఆలయం, పోచమ్మ గుడి, క్రాస్‌రోడ్డు తదితర ఆలయాల వద్ద దుర్గామాత విగ్రహాలను ప్రతిష్ఠించగా మహిళలు ఆటపాటలతో భక్తిగీతాలను ఆలపిస్తూ కోలాటం ఆడుతూ మండపాలకు చేరవేశారు. అనంతరం అమ్మవారికి దీపారాధన, గణపతిపూజ, పుష్పాలంకరణ, మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించారు. భవాని మాల ధరించిన 25మంది స్వాములు, భక్తులు ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి నైవేద్యాలను సమర్పించారు.
- వెంకటాపురం(నూగూరు): మండలంలోని బెస్తగూడెం, పాత్రాపురం, ఆలుబాక, మండల కేంద్రంలోని పాత మార్కెట్ సెంటర్, శివాపురం వీధి, రజకవీధి, వేపచెట్టు సెంటర్, దుర్గమ్మగుడి సెంటర్‌లలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహాలను ప్రత్యేక మండపాల్లో ప్రతిష్ఠించారు. ఈ వేడుకలను తొమ్మిదిరోజులపాటునిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.
- మంగపేట: మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. కమలాపురంలోని శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం, ఆదర్శ కాలనీ, మంగపేటలోని శ్రీ ఉమాచంద్రశేఖరస్వామి దేవాలయం, బోరునర్సాపురంలోని శ్రీసీతారామాంజనేయస్వామి దేవాలయం, చెరుపల్లిలోని రామాలయం, మల్లూరు, వాడగూడెం, రమణక్కపేట, రాజుపేట తదితర గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి పూజలు చేశారు. అర్చకులు, పూజారులు గురువారం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, దీక్షాధారణం, అఖండ దీపారాధన వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలశ స్థాపన, కుంకుమ పూజ అనంతరం బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం గావించారు. భక్తులకు, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

శైలపుత్రి అలంకరణలో అమ్మవారు

మహదేవపూర్, అక్టోబరు 3 : మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీ శుభానందదేవి, పార్వతి అమ్మవారి ఆలయంలో అర్చకులు అమ్మవార్లకు తొమ్మిది రోజుల పాటు విశేష పూజలు నిర్వహించనున్నారు. అమ్మవార్లు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు శ్రీ శుభానందదేవి, సరస్వతి దేవి అమ్మవార్లు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు అమ్మవార్లకు పూర్ణాభిషేకం, గణపతి పూజ, స్వస్తి పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, దీక్షా వస్త్రలంకరణ, రక్షాబంధనం, నవగ్రహ, రుద్ర, నమక, చమక, పంచసూక్త మూలమంత్రి చండీహోమం నిర్వహించారు. భక్తులు దుర్గాభవాని మాలధారణ చేపట్టారు.



అమ్మవారి పూజలో పాల్గొన్న ఆలయ నిర్వాహకులు భక్తులు



శైలపుత్రి అవతారంలో శుభానందదేవి అమ్మవారు

అంగన్‌వాడీ కేంద్రంలో గ్రోత్ మేళా

భూపాలపల్లిటౌన్, అక్టోబరు 3: భూపాలపల్లి పట్టణంలోని హనుమాన్ నగర్-1, అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం గ్రోత్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ బండారి పుష్పలత ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగగా సూపర్‌వైజర్ రజిత హాజరై పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ తల్లులకు,పిల్లలకు ఎత్తు బరువుల గురించి అవగాహన కల్పించారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం అందించే పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అనంతరం పిల్లలకు అక్షరాభ్యాసం చేపించారు. కార్యక్రమంలో ఆయా శారద, ఆశ వర్కర్ కొండా లక్ష్మి, ఏఎన్‌ఎం రమ, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సన్మానం

కాకతీయఖని, అక్టోబరు 3: కోల్ ఇండియా లెవల్‌లో ఆడి పతకాలు సాధించిన సింగరేణి క్రీడాకారులను భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్ గురువారం సన్మానించారు. గత నెల 26 నుంచి 28 తేదీ వరకు ఒడిశాలో జరిగిన కోల్ ఇండియా ఇంటర్ కంపెనీ బాడీ బిల్డింగ్, పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో భూపాలపల్లి ఏరియా సింగరేణి కార్మికులు పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్, మూడు సిల్వర్ మెడల్స్, ఒక బ్రాంజ్ మెడల్ సాధించి ఏరియాకు వచ్చిన కార్మికులను జీఎం శాలువాలు కప్పి సన్మానించారు.

ఈ కార్యక్రమంలో అధికారులు మారుతి, గుండు రాజు, శ్రావణ్‌కుమార్, పర్స శ్రీనివాస్, యూనియన్ నాయకులు రమేష్, సుధాకర్‌రెడ్డి, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు బానిస కావద్దు

మేడారం, అక్టోబరు 3: మత్తు పదార్థాలకు ఎవరు బానిస కావద్దని తహసీల్దార్ తోట రవీందర్ అన్నారు. మేడారం గ్రామ పంచాయతీ భవనంలో కార్యదర్శి సతీష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. గుట్కా, అంబర్, గుడుంబా, మత్తు పదార్థాలకు యువత బానిస కాకూడదన్నారు. పథకాలను గుర్తించి ఉపాధి పొందాలని సూచించారు. పెసా గ్రామ కమిటీ సభ్యులు, జీపీ సిబ్బంది, మాజీ సర్పంచ్ చిడం బాబురావు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

మొగుళ్లపల్లి, అక్టోబరు 3 : మండల కేంద్రానికి గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని గురువారం అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై అశోక్ తెలిపారు. మొగుళ్లపల్లికి చెందిన బండారి వినయ్ హనుమకొండ జిల్లా నడికూడ మండలం వరికోలు నుంచి పావుకిలో ఎండు గంజాయి తీసుకుని ఆర్టీసీ బస్సులో బయలుదేరాడని అన్నారు. ఈక్రమంలో తమకు అందిన సమాచారంతో మొగుళ్లపల్లి గ్రామ శివారులో బస్సును తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసిన వినయ్ పారిపోయేందుకు యత్నించడంతో పట్టుకున్నామని చెప్పారు. అతని వద్ద ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. కాగా, పట్టుకున్న గంజాయి విలువ రూ.5వేలు ఉంటుందని పేర్కొన్నారు.

సీసీ కెమెరాలను ప్రారంభించిన ఎస్సై

కాటారం, అక్టోబరు 3: మండలంలోని చింతకాని గ్రామపంచాయతీ పరిధిలో సీసీ కెమెరాలను ఎస్సై మ్యాక అభినవ్ గురువారం రాత్రి ప్రారంభించారు. గ్రామ ప్రజలు, నాయకులు, వ్యాపారుల సహకారంతో పోలీసు అధికారులు నాలుగు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి గ్రామపంచాయతీ కార్యాలయంలో డిస్‌ప్లే స్క్రీన్ బిగించారు. గ్రామ పెద్దల సమక్షంలో సీసీ కెమెరాలను ప్రారంభించిన అనంతరం ఎస్సై మాట్లాడారు. సీసీ కెమెరాల ద్వారా బహుళ ప్రయోజనాలు ఉన్నాయని, గ్రామ ప్రజలు వాటి పనితీరుపై తమకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో పీసీ నాగరాజు, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి మహిళ మృతి

కృష్ణకాలనీ(భూపాలపల్లి), అక్టోబరు 3: విద్యుత్ తీగలు తగిలి ఓ మహిళ మృతి చెందిన ఘటన కమలాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన ప్రకారం... భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన గంట సుక్కక్క (38) తనకున్న 2 ఎకరాల పత్తి చేనులోకి గురువారం పనికి వెళ్లింది. ఈ క్రమంలో పత్తి చేనుకు రక్షణగా గతంలో చుట్టూర విద్యుత్ తీగలతో పాటు సోలార్ తీగలను ఏర్పాటు చేసుకున్నారు. పనిలో నిమగ్నమైన క్రమంలో పత్తి చేనులోకి కోతుల గుంపు రావడంతో సోలార్ తీగలకు బదులుగా, విద్యుత్ తీగలను విద్యుత్ లైన్‌కు తగిలించింది. పనిలో నిమగ్నమైన ఆమె ప్రమాదవశాత్తు ఆ తీగలకు తాకింది. దీంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడే కుప్పకూలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేసినా అప్పటికే మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.